## సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

- **ఐటీడీఏ పీవో రాహుల్**



**భద్రాచలం, జూలై 14,ప్రజాజ్యోతి :** వర్షాకాల సీజన్ లో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. సోమవారం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు ఓ మహిళకు లేప్రోస్కోపిక్ సర్జరీ చేసి విజయవంతమైన వైద్యులు వెంకట్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, వైద్యబృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీవో మాట్లాడుతూ అమయాక గిరిజనులు సరైన అవగాహన లేక భయంకర వ్యాధులతో ఇబ్బందులు పడుతుంటారని, అందుకు వైద్యులు, సిబ్బంది అలాంటి వారిని గుర్తించి వైద్యసేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో పనిచేసే డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 15 | జులై | 2025 ◆ పేజీలు : 6





# మేక పాలు... మహా మేలు...

- **చిన్నజీవి గొప్ప విలువ !**
- **ఆవు, గేదె కన్నా మేక పాలు శ్రేష్ఠం**
- **ఈ పాలతో ఆరోగ్యానికి ఎక్కువ మేలు**
- **నిపుణులతో జత కట్టిన జిల్లా కలెక్టర్**
- **పాలు కాదు, పౌష్టికపానీయమే అంటూ కితాబు..!**

2 లో..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 14, ప్రజాజ్యోతి :** ఒక చిన్న మేకను మనం చూసినప్పుడు, అది మన ఆరోగ్యాన్ని పట్టుకొని నిలబెట్టగలదని ఎవరు ఊహించగలమా..? కానీ ఇప్పుడు వైద్య రంగం, పోషకాహార నిపుణులు, ప్రభుత్వాధికారులు కూడా అదే చెప్తుతున్నారు.. "మేకపాలు మహా మేలు, అది ఓ ఆరోగ్య సంజివిని అని !". వినూత్న ఆలోచనలకూ పెట్టిందే పేరుగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సైతం ఇదే విషయాన్నీ విశ్వసిస్తున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహిళ శక్తి ఫుడ్ కోర్ట్ సందర్శన లో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, "గేదె, ఆవుపాలకంటే మేకపాలు ఆరోగ్య పరంగా అత్యంత శ్రేష్ఠమైనవి," అని చెప్పారు. ఇది పలు పరిశోధనలు, ప్రజల అనుభవాల ఆధారంగా ఎటువంటి సందేహాలకూ తావు లేకుండా స్పష్టం అవుతోంది అని అయన పేర్కొన్నారు.

## కోన్ టిక్ కొలిమి విధానంలో బయోచార్ తయారీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 14, ప్రజా జ్యోతి** చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ లోని డంపింగ్ యార్డ్ లోని సెగ్రిగేషన్ షెడ్ లో మట్టి , మట్టి ఇటుకలతో నిర్మించిన కోన్ టిక్ కొలిమినందు ఎండిన సర్కారు తుమ్మ, చెట్ల కొమ్మలు చిన్న చిన్న ముక్కలుగా చేసి మంట ద్వారా బయోచార్ తయారు చేసే ప్రక్రియను సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధంగా తయారైన బయోచార్ ( జీవ బొగ్గు )ను గోమూత్రం , గోవు పేడ లో కొన్ని రోజులు నిలువ ఉంచి, ఆరబెట్టి,పొడిచేసి పంటలకు సేంద్రియ ఎరువుగా వాడితే భూసారం అభివృద్ధి అవుతుందని, అధిక దిగుబడులు పొందవచ్చునని కలెక్టర్ తెలిపారు. గ్రామపంచాయతీలలో గృహముల నుండి, షాపుల నుండి చెత్త సేకరించేటప్పుడు తడి చెత్త పొడి చెత్తగా వేరువేరుగా

మిగతా 2 లో...

## ప్రజావాణి లో వచ్చిన ప్రతి దరఖాస్తు లను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- **అదనపు కలెక్టర్ వేణుగోపాల్**



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 14, ప్రజా జ్యోతి** సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు.

**ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులు**

సుజాతనగర్ మండల పరిధిలోని వేపలగడ్డ గ్రామం వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి కి సంబంధించి 0.7 కుంటల భూమి కోల్పోయిన చెట్టుపల్లి ప్రభాకర్ రావు అనే రైతు తాను కోల్పోయిన భూమికి నష్టపరిహారం ఇప్పటివరకు అందలేదని, కావున త్వరితగతిన నష్టపరిహారం ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకొని సమస్యను

మిగతా 2 లో...

## ప్రజావాణి లో వచ్చిన ప్రతి దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

పరిష్కరించాలని కొత్తగూడెం ఆర్డీవో కు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. కొత్తగూడెం ఎన్కె నగర్ లో నివాసం ఉంటున్న సాకా ఠాగూర్ ,తండ్రి పుష్పరాజు గత సంవత్సరం ఇంజనీరింగ్ విద్యను అభ్యసించడానికి కే ఎల్ ఆర్ కళాశాల నందు జాయిన్ అయ్యానని, కానీ అనారోగ్య కారణం చేత కళాశాలకు వెళ్లలేకపోయానని, తన ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కళాశాలలను సంప్రదించగా మొత్తం ఫీజు చెల్లిస్తేనే తనకు సర్టిఫికెట్లు ఇస్తామని తెలియజేశారని, తన తల్లిదండ్రులు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నామని కావున తనకు తన యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇప్పించవలసిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం డి సెక్షన్ సూపర్డెంట్ కు ఎండార్స్ చేశారు. అదేవిధంగా పాల్వంచ మండలం యానం బైలు గ్రామంలో నివాసం ఉంటున్న ముగితే గురవయ్య , తండ్రి వెంకయ్య తనకు పూర్వీకుల నుండి వారసత్వంగా రాజాపురం గ్రామం శివారులో సర్వేనెంబర్ 107/72/1 లో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఆ వ్యవసాయ భూమిని సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమ భూమికి నలువైపులా ఉన్న వ్యక్తులు తన వారసత్వ భూమిని ఆక్రమించుకున్నారని కావున తమ భూమిని సర్వే చేసి తన ఐదు ఎకరాల భూమికి హద్దులు నిర్ణయించేటట్లు చర్యలు చేపట్టాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం పాల్వంచ తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో నివాసం ఉంటున్న కుంజా తిరుపతమ్మ ,తాను ఒక నిరుపేద గిరిజన మహిళనని, పేదరికం వలన బ్రతుకు దుర్భరంగా మారినందున బ్రతుకుతెరువు కొరకు ఏదైనా పథకం క్రింద రుణం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఐటిడిఏ పిఓ కు ఎండార్స్ చేశారు. అశ్వరావుపేట మండలం పేరాయి గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొంతమంది ప్రజలు తమ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కొరకు ఎంపిక చేసిన జాబితా నుండి అనర్హులను తొలగించి, తమ గ్రామమునందు గల నిరుపేదలకు, వితంతువులు ,వికలాంగుల పేర్లు జాబితాలో చేర్చాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం హౌసింగ్ పిడి , అశ్వరావుపేట ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు , అదేవిధంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారుల పై చర్య తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కోన్ టిక్ కొలిమి విధానంలో బయోచార్ తయారీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



(మొదటి పేజీ తరువాయి...)

సేకరించాలని ఆదేశించారు. డంపింగ్ యార్డ్ లోని సెగ్రి గేషన్ షెడ్లలో తయారుచేసిన(కూరగాయ వ్యర్థాలు )కంపోస్ట్ ఎరువును కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుభాషిని, డిఎల్పిఓ ప్రభాకర్ రావు, ఎంపీ ఓ సత్యనారాయణ, డి ఆర్ డి ఏ ఈ సి రాజు, ఎంఈఓ రాజేశ్వరి, ఏఈఓ మమత తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి...)

24 గంటలూ అందుబాటులో ఉండి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. గోదావరి వరదల నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందేలా ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని, అందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏడీఎంహెచ్వో చైతన్య, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, లాప్రోస్కోపిక్ సర్జన్ , వైద్యురాలు నిఖితలు పాల్గొన్నారు.

# మేక పాలు.. మహా మేలు..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 14, ప్రజాజ్యోతి ;** ఒక చిన్న మేకను మనం చూసినప్పుడు, అది మన ఆరోగ్యాన్ని పట్టుకొని నిలబెట్టగలదని ఎవరు ఊహించగలమా..? కానీ ఇప్పుడు వైద్య రంగం, పోషకాహార నిపుణులు, ప్రభుత్వాధికారులు కూడా అదే చెప్పుతున్నారు.. "మేకపాలు మహా మేలు, అది ఓ ఆరోగ్య సంజివిని అని !". వినూత్న ఆలోచనలకూ పెట్టిందే పేరుగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సైతం ఇదే విషయాన్నీ విశ్వసిస్తున్నారు. సోమవారం జిల్లా కేంద్రం లోని మహిళ శక్తి ఫుడ్ కోర్ట్ సందర్శన లో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, "గేదె, ఆవుపాలకంటే మేకపాలు ఆరోగ్య పరంగా అత్యంత శ్రేష్ఠమైనవి," అని చెప్పారు. ఇది పలు పరిశోధనలు, ప్రజల అనుభవాల ఆధారంగా ఎటువంటి సందేహాలకూ తావు లేకుండా స్పష్టం అవుతోంది అని అయన పేర్కొన్నారు.

### పాలు కాదు, పౌష్టిక పానీయమే !

మేకపాలలో ఎన్నో ముఖ్యమైన పోషకాలు కలిగి ఉంటాయని నిపుణులు నిక్కర్సుగా తెలుపుతున్నారు. ఈ పాలతో శరీరానికి ప్రోటీన్ (3.6% వరకు ఉంటుంది) త్వరగా లభిస్తుందని, ఇది శిశువుల పెరుగుదలకి, కండరాల అభివృద్ధికి ఆధికంగా దోహదపడుతుందని పరిశోదాత్మకంగా ప్రకటిస్తున్నారు. మానవ ఎముకలకు కావలసిన ప్రధాన మూలకం కాల్షియం ఇందులో అధికంగా ఉంటుంది. ఈ పాలలో విటమిన్ ఎ , డి , బి 2 (రిబోఫ్లావిన్) అధికంగా ఉండటం వలన కంటి చూపు , జీర్ణవ్యవస్థ, చర్మ ఆరోగ్యానికి ఎంతో తోడ్పాటుగా ఉంటాయి. ప్రధానంగా హృదయ ఆరోగ్యానికి అవసరమైన ఫాస్ఫరస్, పొటాషియం, మాంగనీస్ ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి . దీనిలోని ఫ్యాట్ గ్లోబ్యూళ్లు చిన్నవిగా ఉండడం వలన ఈ పాలు అన్ని వయసుల వారికీ సులభంగా జీర్ణమవుతాయి. ఇది లాక్టోజ్ ఇంటోలరెన్స్ (శరీరంలో లాక్టోజ్ ఎంజైమ్) తక్కువగా ఉన్నవారికీ సురక్షితంగా ఉంటుందని, శ్వాస సంబంధిత రుగ్మతల నివారణలో సహాయపడతాయని పరిశోధకులు తేల్చారు. దీంతో ఐదు నెలల బిడ్డల నుంచి వృద్ధుల వరకు అందరూ తేలికగా తీసుకోగలిగే ద్రవ ఆహారంగా, పౌష్టికపానీయంగా ఇది మారుతోంది.

### వ్యాపారం కూడా గొప్ప అవకాశమే!

మేకలు పెద్దగా పెట్టుబడి అవసరం లేకుండా పెంచగలిగే జంతువులు. కనీస పెట్టుబడి, తక్కువ మేతతో ఎక్కువ మద్దతు.. ఇది రైతుల కోసం అమూల్యమైన ఆస్తిగా కలెక్టర్ పేర్కొన్నారు. ఒక్క మేక రోజుకు సుమారు 1.2 – 1.5 లీటర్ల పాలు ఇస్తుంది. లీటర్ గోట్ మిల్క్ మార్కెట్ రేటు సగటున రూ. 70 నుండి రూ. 100. నెలకి 40 లీటర్లు అంటే కనీసం రూ. 3000 నుండి రూ. 4000 ఆదాయం. గోట్ ఫార్మింగ్, పాల ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పరిస్తే జిల్లా లోని గ్రామీణ ప్రాంత ప్రజలకి ఓ ఉపాధికి మార్గం ఏర్పడుతుంది. మేకపాల ఆధారంగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏర్పడిన కంపెనీలు ఇప్పుడు గోట్ మిల్క్ సోప్,గోట్ మిల్క్ స్కిన్ క్రీమ్స్, బేబీ ఫార్ములా మిల్క్ వంటి ప్రత్యేక ఉత్పత్తులతో మార్కెట్ ను ఆక్రమిస్తున్నాయి. ఈ పాలను ఉపయోగించి తక్కువ ఆమ్లతతో కూడిన పెరుగు, విదేశాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన పదార్థం గోట్ చీజ్, మేకపాల ఆధారిత బేబీ ఫుడ్ మిశ్రమాలు తాయారు చేసుకోవచ్చు. ఈ పాలు ఆధారిత బేబీ ఫుడ్ మిశ్రమాలు ప్రస్తుత మార్కెట్ లో పెద్ద భాగం ఆక్రమించాయి. ఆరోగ్య సూత్రాలను పరిపాటిగా అనుసరించే నేటి కలం లో మేకపాలను పక్కన పెట్టే శకం ముగిసింది. ఇప్పుడు మేకపాలు ఆహార భద్రతకు, ఆరోగ్య పరిరక్షణకు, గ్రామీణ ఆదాయాభివృద్ధికి అద్దం పట్టే మార్గంగా మారుతోంది. అన్ని మంచి విషయాలు చిన్నపాటి మార్పుల నుంచే మొదలవుతాయన్నది మేకపాల కథ. వాటి విలువను జిల్లా ప్రజలు గ్రహించాలి, వినియోగించాలి, వ్యాపారంగా అభివృద్ధి చేయాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకాంక్షించారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి.

- - ప్రైవేటు కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కాలేజీలను అభివృద్ధి చేయాలి
- - ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీందర్




**భద్రాచలం టౌన్, జులై 14(ప్రజాజ్యోతి):** భద్రాచలం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులను నుండి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం లేకపోవడంతో పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు అని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.భద్రాచలం ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల లో సెమినార్ హాల్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సెమినార్ హాల్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కళాశాల లో టాయిలెట్లు పరిశుభ్రత లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని,బాయ్స్ విద్యార్థులకు టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.బాయ్స్ టాయిలెట్సును వెంటనే నిర్మించాలని అన్నారు.కళాశాల చుట్టు పక్కల దోమల నివారణ మందు పిచికారి చేయించాలని అన్నారు.కళాశాల చుట్టు పక్కల పారిశుధ్యం పనులు వెంటనే నిర్వించాలన్నారు.జూనియర్ కళాశాలలో వెంటనే మెడికల్ క్యాంపు నిర్వహించి విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు తగ్గట్టుగా తరగతి గదుల్లో బల్లలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు కాలేజీలకు దీటుగా ప్రభుత్వ కాలేజీలను అభివృద్ధి చేసి విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలకు దూరం కాకుండా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.భద్రాచలం జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు సౌజన్య,పవన్, కళ్యాణ్,గీత,అముల్యా,అనిత, స్వరూప, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు అండ ఎర్రజెండా




**ఇల్లందు, జులై 14, ప్రజాజ్యోతి:** రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సిపిఐ ఎర్రజెండా అండగా ఉంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా స్పష్టం చేశారు. సోమవారం జరిగిన సిపిఐ 19వ మహాసభలో ఆయన మాట్లాడుతూ వందేళ్ళ సుదీర్ఘ సిపిఐ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని పోరాటాలను నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలక ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై నిరంతరం ఉద్యమాలను చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాకార్లు, భూస్వాములు, పెత్తం దారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి దొరలు, దేశ్ ముఖ్ లను తరిమికొట్టి లక్షలాది ఎకరాల భూమిని ప్రజలకు పంచిన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల కడుపు కొడుతుందని, పోరాడి సాధించుకున్న చట్టాలను ఏకపక్షంగా రద్దుచేసి 4 లేబర్ కొడులను కార్మిక లోకంపై రుద్ది దుర్మార్గపు పాలనను కొనసాగి స్తున్నారని ఆరోపించారు. దేశంలో బడా బాబులకు అనుకూలంగా చట్టాలను సవరించుకుంటూ పోతున్నారని, బిజెపి ప్రభుత్వం ప్రత్యేక రాజ్యాంగాన్నితెచ్చేందుకు కుట్రలు పందుతుందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో సిపిఐ పూర్తిస్థాయిలో ప్రాతినిధ్యం ఉండాలని, ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ ద్వారా ఇల్లందు డోర్నకల్ మైబాద్ పినపాక నియోజకవర్గం అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో సిపిఐ పాత్ర ఎంతో ఉందని స్పష్టం చేశారు. డిసెంబర్ 26న సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. 21 ఏరియా సిబిఐ కి కంచుకోట లాంటిదని, ఎంతోమంది సిపిఐ నాయకులు ఆ ప్రాంతం నుండి తయారు అయ్యారని పేర్కొన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో జూలై 9న జరిగిన దేశవ్యాప్త సమ్మెలో 25 కోట్లకు పైగా సంఘటిత సంఘటిత కార్మికులు రోడ్డుపైకి రావడంతో బిజెపి ప్రభుత్వం భయాందోళనకు గురైందన్నారు. దేశభక్తి సమ్మెలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడికి ధన్యవాదాలు తెలిపారు. బిజెపి ప్రభుత్వంలో ప్రజలు వాడే నిత్యవసర సరుకుల ధరలు, గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు బాగా పెరిగాయని విమర్శించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అదా నీ అంబానీలకు కట్టబెట్టి ప్రైవేట్ పరం చేయడానికి బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. దేశంలో 37% ఓట్లతో గెలిచిన బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలకు 51 శాతం మద్దతు ఉంటేనే కొనసా గుతాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆపరేషన్ కగారు పేరుతో మావోయిస్టులు ఆదివాసి ప్రజలు రెండువేల మందికి పైగా బీజేపీ దమనకాండ కు మృతి చెందారని ఆరోపించారు. 2026 మార్చ్ లోపు మా వయసును అంతం చేయడం కాదని, 2026 లోపు దేశంలో విద్య, వైద్యం రైతుల గిట్టుబాటు ధర అందించాలని డిమాండ్ చేశారు. మణుగూరు ఏరియాలో ఓసి నిర్వాసితులకు ప్యాకేజ్ ఇచ్చిన విధంగానే పూసపల్లి ఓసి నిర్వాసితుల ప్రాంతాలైన 21 ఏరియా, పూసపల్లి, తిలక్ నగర్, విజయలక్ష్మి నగర్, 24 ఏరియా వాసులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని 2019 సింగరేణి చట్టం ప్రకారం అమలు చేయాలని, లేనియెడల అఖిలపక్షం ఆధ్వర్యంలో సింగరేణి నివాస ప్రాంత ప్రజలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇల్లందును రెవిన్యూ డివిజన్ గా, బోడు, కొమరారం లను మండలాలుగా ఏర్పాటు చేయాలన్నారు. సిపిఐ అధికార పార్టీతో కలిసి ఉన్న ప్రజలు ఎదుర్కొనే ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిటీ సభ్యుడు మిర్యాల రంగయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. సారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్ ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్, సిబిఐ పట్టణ కార్యదర్శి భాస శ్రీనివాస్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు బంధం నాగయ్య, పట్టణ, మండల మహిళా కార్యదర్శులు కమటం చంద్రకళ, తడికల శ్రీలక్ష్మి, నాయకులు ఉడత ఐలయ్య, వడ్ల శ్రీను, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మండల కార్యదర్శిగా బొప్పిశెట్టి



**ఇల్లందు, జులై 15, ప్రజాజ్యోతి:** సిపిఐ ఇల్లందు మండల కార్యదర్శిగా బొప్పిశెట్టి సత్యనారాయణ ను సోమవారం సిపిఐ మండల 19వ మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బొప్పిశెట్టి సత్య నారాయణ 1965లో సిపిఐ అనుబంధ బాలసంఘం నేత సిద్ది వెంకటేశ్వర్లు నేతృత్వంలో పని చేయడం జరిగింది. అనంతరం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏఐఎస్ఎఫ్ జనరల్ సెక్రటరీగా కొనసాగాడు. ఏఐవైఎఫ్ లో తన వంతు భూమిక పోషించారు. సిపిఐ పార్టీ కౌన్సిల్ సభ్యుడిగా, ఏఐటియుసీ కొత్తగూడెం మెయిన్ వర్క్ షాపు జనరల్ సెక్రటరీగా, కార్పొరేట్ కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగాడు. సింగరేణిలో పదవీ విరమణ అనంతరం ఇటు సిపిఐ పార్టీ, అటు ఏఐటియుసీకి పూర్తి సమయం కేటాయించారు. పార్టీ, యూనియన్ పై తనకు ఉన్న అనుబంధం నేపథ్యంలో సిపిఐ ఇల్లందు మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని, కార్మిక, కర్షక, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో సిపిఐ గెలుపు కోసం పార్టీ ఆదేశాలు, సూచనల మేరకు ముందుకు సాగడం జరుగుతుందని పేర్కొన్నారు. తనకు సిపిఐ మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సిపిఐ శ్రేణులకు, సహ కరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి



**ఇల్లందు, జులై 15, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టర్లు సకాలంలో కార్మికులకు వేతనాలు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లందు ఏరియాలోని జెకె సివిల్, జెకె ఓసి, 24 సివిల్, కోయగూడెం ఓసిపి నందు వివిధ పనులు కాంట్రాక్టు కార్మికులు నిర్వ హిస్తున్నారని, వారి వేతనాలు ప్రతినెల 7వ తేదీలోగా చెల్లిం చాలని ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు సంస్థ ఉత్తర్వులను ఉల్లంఘించి 15నుంచి 20వ తేదీలలో వేతనాలను కార్మికుల ఖాతాలో జమా చేస్తున్నారని తెలిపారు. జులై నెలలో నేటి వరకు కార్మికుల వేతనాలు చెల్లించలేదని, కార్మికుల కుటుంబాలు ఈ వేతనాలపై ఆధారపడి జీవిస్తున్నారని, సకాలంలో వేతనాలు అందక కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొ న్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్లు సంస్థ ఉత్తర్వులను పాటిస్తూ కార్మికుల వేతనాలు ఇచ్చేలా సింగరేణి అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల ధర్నా



**ఇల్లందు, జులై 15, ప్రజాజ్యోతి:** గత ప్రభుత్వంలో మన ఊరు – మన బడి పథకం ద్వారా పనులు చేప ట్టిన కాంట్రాక్ట ర్ల కు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం కాంట్రాక్టర్లు హైదరాబాదులోని విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అప్పులు తెచ్చి మన ఊరు – మన బడి పనులను పూర్తి చేశామని, ఏళ్ళు గడుస్తున్న నేటికి ఆ బిల్లులను మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు విన తిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం ఇల్లందు కాంట్రాక్టర్లు కొల్లి సంజీవ రెడ్డి, పర్రె శ్రీనివాస్, ఊరకొండ ధనుంజయ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న ఇంటి పైన దాడి హేయమైన చర్య

- - దాడిని ఖండించిన బీసీ ఐక్యవేదిక



**భద్రాచలం టౌన్,జూలై 14(ప్రజాజ్యోతి):** తీన్మార్ మల్లన్న ఇంటిపై కల్వకుంట్ల కవిత తన ముఠాతో వెళ్లి దాడి చేయటం చాలా హేయమై నటువంటి చర్య అని , దాడిని భద్రాచలం బీసీ ఐక్యవేదిక ఖండించింది. ప్రజాస్వామ్యంలో సమంజసం కాదు అని, ఇలాగ దాడులు చేయాలంటే కేసీఆర్ ఎన్ని విధాలుగా మాట్లాడాడో ఆ విషయం అందరికీ తెలుసు అని, అప్పుడు ఈ విధంగా దాడులు చేసినట్లయితే మీరు ఎక్కడ ఉండే వాళ్ళని బీసీ సంఘం నాయకులు ప్రశ్నించారు. బీసీలను భయభ్రాంతులను చేయాలని మీరు ప్రయత్నించినట్లయితే అది మీ అమాయకపు పని అవుతుంది అని,మీరు అధికారంలో వున్నప్పుడు బీసీ లకు తీవ్రంగా అన్యాయం జరిగిందని 33 శాతం రిజర్వేషన్ ను 18 శాతం చేశారని,ఇప్పుడు రాష్టం లో అధికారం పోయేసరికి బీసీ లు గుర్తుకొచ్చారా అని అన్నారు.భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడినట్లయితే బీసీలు చేసేటువంటి తిరుగుబాటు చాలా తీవ్రంగా ఉంటుందని, ప్రజాస్వామ్యంలో ఉన్నవాళ్లు ప్రజాస్వామ్య విధంగానే నడుచుకోవాలి కానీ ఈ విధంగా చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బొలిశెట్టి రంగారావు, ప్రధాన కార్యదర్శి బండారు నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు టివి, తాళ్ల రవికుమార్, ఉపాధ్యక్షులు అనుకోజు నరసింహ చారి, కోశాధికారి కొప్పనాతి శాంతారావు,సహాయ కార్యదర్శి మేకల మల్లు బాబు తదితరులు పాల్గొన్నారు

## పాఠశాలలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం

- తొలి అడుగు-ఇంపాక్ట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కార్యాచరణ




**అన్నపురెడ్డిపల్లి, జూలై 14, ప్రజాజ్యోతి:** అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్న పురెడ్డిపల్లి మండలంలోని కస్తూర్బా బాలికా పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల ఎర్రగుంట, ప్రాథమిక పాఠశాల ఎర్రగుంటలలో ఈ రోజు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని తొలి అడుగు సంస్థ (ఎర్రగుంట పాఠశాల పూర్వ విద్యార్థుల సంస్థ) మరియు ఇంపాక్ట్ సంస్థ సంయుక్తంగా చేపట్టాయి. ఈ కార్యక్రమంలో జి. నాగమణి, ఎం. సౌజన్య, ఎం. లావణ్య, కె. గోపాలకృష్ణ, టి. శేఖర్ పాల్గొన్నారు. వారు విద్యార్థులకు లక్ష్య నిర్దేశనం, ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత తదితర అంశాలపై ముఖ్యంగా బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్ మాట్లాడుతూ – "విద్యార్థులు చిన్నప్పటినుండే మంచి అలవాట్లు నేర్చుకోవాలి," అని అన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ చూపి వ్యక్తిత్వాన్ని మెరు గుపర్చుకోవాలని సూచించారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న గంపా నాగేశ్వర్ రావును ఆయన ప్రత్యేకంగా అభి నందించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా బాలికా పాఠశాల ప్రత్యేక అధికారి డి. శారద, ఎర్రగుంట ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు జి. శంకర్ మహదేవన్, ఉపాధ్యాయులు శాంతకుమారి, సుశీల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ తిరుమల రావు పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలి

- - బిఎస్పీ భద్రాచలం నియోజకవర్గ ఇన్ చార్జ్ గుర్రాల దుర్గా భవాని



**భద్రాచలం టౌన్, జులై 14(ప్రజాజ్యోతి):** ప్రముఖ న్యాయవాది సాధన పల్లి సతీష్ పై సామాజిక మాద్యమ వేదికగా కుల అహంకార వ్యాఖ్యలు చేసిన సహచర అడ్వకేట్ తిరుమల రావు పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయడంలో పోలీసులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఇన్ చార్జ్ గుర్రాల దుర్గా భవాని పోలీసు శాఖను నిలదీశారు.భద్రాచలం నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆమె మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల ప్రజలు ఉన్నత చదువులు చదివి,న్యాయ వాద వృత్తి చేపట్టినా ఆదిపత్య కుల వర్గాల నుండి అవమానాలు తప్పడం లేదని వాపోయారు.ఒక న్యాయ వాదికే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఊహించడానికే కష్టం గా ఉందని అన్నారు.భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 17 కుల వివక్ష ను రద్దు చేసి నప్పటికీ రాజ్యాంగం చదువుకొని లాయర్ వృత్తి చేస్తున్న తిరుమల రావు ఈ అహంకార పూరిత వ్యాఖ్యలు ఎలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తిరుమల రావు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి అరెస్టు చేసి,తిరుమల రావు లా లైసెన్స్ సర్టిఫికెట్ ను రద్దు చేసి బార్ కౌన్సిల్ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. న్యాయవది వృత్తకే సదరు లాయర్ కళంకం తీసుకొచ్చారని అన్నారు. ఈ సమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కొండా చరణ్ , సామల ప్రవీణ్, గోగికార్ రామ్ లక్ష్మణ్, గుర్రాల విజయ్ కుమార్, ఎస్.కె జహీర్ ఉద్దీన్ భాష తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన స్కూల్ ఫీజులు వెంటనే తగ్గించాలి

- -యాజమాన్యానికి ఐఎన్టీయూసీ మిత్రపక్షాల వినతి



**బూర్గంపహాడ్, జూలై 14 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని సారపాకలో ఐటీసీ నడుపుతున్న బీపీఎల్(భద్రాచలం పబ్లిక్ స్కూల్)లో పెంచిన స్కూల్ ఫీజులు తక్షణమే తగ్గించాలని ఐఎన్టీయూసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో సోమవారం గేట్మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డిలు మాట్లాడుతూ వెల్ఫేర్లో భాగమైన స్కూల్ను ఇప్పుడు ఉన్న గుర్తింపు సంఘం కలిసి కార్పోరేట్ విద్యాసంస్థగా మార్చారని, గతంలో ఎన్నడూ లేనివిధంగా హద్దూఅదుపూ లేకుండా స్కూల్ ఫీజులు పెంచుతూ కార్మికులను ఆర్థికంగా నష్టానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. పీపీ-1 పిల్లలకు రెడ్డిపాలెం, బూర్గంపహాడ్, మోరంపల్లిబంజర్ మీదుగా స్కూల్ బస్సు నడపాల్సి ఉన్నా బీపీఎల్ స్కూల్లో టెన్త్ క్లాస్ వరకు చదివిన పిల్లలకు ఇదే కళాశాలలో జాయిన్ అయితే అడ్మిషన్ ఫీజు తీసుకోకూడదని, అదనంగా మరో స్కూల్ బస్సును ఏర్పాటు చేయాలన్నారు. 13వ ఎల్డీఏలో రాసుకున్న సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని, బదిలీ కార్మికుని సర్వీస్ గ్రాట్యూటీ లెక్కించాలని వెంటనే వాటిని పరిష్కరించాలనే తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమావేశం అనంతరం ఐటీసీ యాజమాన్యానికి ఐఎన్టీయూసీ బాధ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, బదిలీ కార్మికులు పాల్గొన్నారు.

# కాలేజీ సెంటర్ అడ్డా ఆటో వర్కర్లకు న్యాయం చేయండి

- - గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఐటీడీఏ పి ఓ రాహుల్ ని కోరిన ఆటో కార్మికులు



**భద్రాచలం టౌన్, జులై 14 (ప్రజాజ్యోతి):** భద్రాచలం జూనియర్ కాలేజీ గ్రౌండ్ వద్ద గల అడ్డా నుండి కూనవరం, చింతూరు ప్రాంతాలకు ఆటో సర్వీసులు ప్రతిరోజు నిర్వహించుకుంటూ సుమారు 200 కుటుంబాలను పోషించుకుంటున్నామని, కొంతమంది వ్యక్తులు అడ్డాను ఆక్రమించి అక్రమ కట్టడం నిర్మించడం ద్వారా ఆటోలకు అడ్డా లేకుండా చేస్తున్నారని సోమవారం ఆటో కార్మికులు భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ ని కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజు కాలేజీ గ్రౌండ్ వద్ద గల అడ్డా నుండి కూనవరం, చింతూరు, వి ఆర్ పురం ప్రాంతాలకు 200 పైగా ఆటోలు ప్రయాణికులను తీసుకుని వెళ్లి వస్తుంటాయని ప్రస్తుతం ఆ అడ్డాపై కన్నేసిన కొంతమంది స్థానిక అధికారులను లోబర్చుకొని తమకు అడ్డా లేకుండా చేసి తమ కుటుంబాలను రోడ్డును పడటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వారు వాపోయారు. గతంలో ఐటీడీఏ పీవో గా పనిచేసిన నటరాజ్ గుల్జార్ చింతూరు కూనవరం ప్రాంతాలకు వెళ్లే ఆటోల కోసం అధికారులతో మాట్లాడి ఆటో అడ్డాకు స్థలం కేటాయించాలని వారు తెలిపారు. ఇటీవల గ్రామపంచాయతీ అధికారులు సులభ కాంప్లెక్స్ నిర్మించగా దాని ప్రక్కన ఉన్న ఆటో అడ్డా స్థలంలో కొంతమంది రేకులు షెడ్యూల్ వేసుకొని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఐటీడీఏ పి ఓ రాహుల్ కలుగజేసుకొని న్యాయం చేయాలని వారు కోరారు. ఈ ఆటోల మీద జీవించే కుటుంబాలలో అధిక శాతం గిరిజన కుటుంబాలని వారు తెలిపారు. దీనికి స్పందించిన పిఓ మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు కూడా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జేఏసీ నాయకులు మర్మం శంకర్, రాయల శ్రీను, తుమ్మారపు కోటేశ్వరరావు, గొల్ల నరేష్, యాదగిరి రవీందర్,మహేష్ సతీష్ తోపాటు గిరిజన సంఘాల నాయకులు పూనం వీరభద్రం, పూనం కృష్ణ , సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# సమ్మెను సెలవుగా పరిగణించాలి




**ఇల్లందు, జులై 15, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ మనుగడకోసం, కార్మికుల, అధికారుల ఉద్యోగ భద్రత కోసం, కార్మిక చట్టాల రక్షణ కోసం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణి జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు జులై 9న సింగరేణి కార్మికులు చేసిన సమ్మెను సెలవు దినంగా పరిగణించాలని టిబిజికెఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ రంగనాథ్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ యండి. జాఫర్ హుస్సేన్ లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఈ సమ్మెతో భవిష్యత్ కార్మికోద్యమ కార్యాచరణకు ఊతమిచ్చి కేంద్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేసినట్లయిందన్నారు. సమ్మెలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కూడా పాల్గొన్నాయని, చట్టబద్ధమైన సమ్మెలో పాల్గొన్న కార్మికులకు వేతన నష్టం జరగకుండా సెలవు పెట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు. అదేవిదంగా అవుట్సోర్సింగ్ కార్మికులకు కూడా సెలవురోజు పని కల్పించి నష్టపోకుండా వేతనం చెల్లించాలని పేర్కొన్నారు.

# జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక



**బూర్గంపహాడ్, జూలై 14 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తేజావత్ మోహన్ జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యారు. ఇటీవల రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో సత్తా చాటారు. నూతన అభ్యసన ప్రక్రియలకు సంబంధించి ఉత్తమ ప్రదర్శన అందించిన ఉపాధ్యాయులను రాష్ట్రం నుంచి 10 మందిని ఎంపిక చేయగా అందులో తేజావత్ మోహన్ ఎంపిక కావడం విశేషం. ఆయన జూలై 16 నుంచి ఆగస్టు 5వ తేదీవరకు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్పూర్లో నిర్వహించే శిక్షణలో పాల్గొననున్నారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు జాతీయ విద్యావిధానంఅమలు, భారతీయ కళలు, సంస్కృతి, వారసత్వంపై సైద్ధాంతిక అధ్యయనం, చారిత్రక కట్టడాలు, మ్యూజియంలకు విద్యా పర్యటనలు, విద్యను సంస్కృతితో అనుసంధానించే ప్రాజెక్టుల రూపకల్పన వంటి అంశాల్లో శిక్షణ పొందనున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మోహన్ను డీఈవో వెంకటేశ్వరచారి, ఎంఈవో యదుసింహరాజు, పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు భాస్కరరావులు ప్రత్యేకంగా అభినందించారు.

# అటవీ ప్రాంతంలో విత్తనాలు చల్లిన రామవరం పాఠశాల విద్యార్థులు

- జిల్లాలో విస్తృతంగా విత్తనాల సేకరణ కార్యక్రమం



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 14, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆధ్వర్యంలో ప్రకృతి పరిరక్షణకు భాగస్వాములుగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో, ఇటీవల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విత్తనాల సేకరణ పై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆచరణాత్మకంగా తీసుకుంటూ రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన విత్తనాలను నేడు గరీబ్ పేట్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో జల్లారు, విద్యార్థులు స్థానికంగా సేకరించిన టేకు, చింత, గానుగ, వేప ,పనస విత్త నాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి వాటిని అటవీ ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా పునరావసం చేయాలని దృష్టితో చల్లారు. వర్షాకాలాన్ని అనుకూలంగా భావించి, విత్తనాల అభివృద్ధికి సహాయకంగా ఉండే ప్రదేశాలను అటవీ శాఖ సహకారంతో గుర్తించి అక్కడ చల్లడం జరిగిందని రామవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ప్రభుదయాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్ బాబు, శంకర్ ఇతర సిబ్బందితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్

- -పోలీసుల అదుపులో ముగ్గురు -పరారీలో ఏడుగురు



**ఇల్లెందు, జులై 15, ప్రజాజ్యోతి:** పట్టణంలోని స్టేషన్ బస్తి ఏరియాలో పేకాట స్థావరంపై సోమవారం ఇల్లందు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు, మరో ఏడుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ. 4 వేలు నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. చట్ట వ్యతిరేకమైన పేకాటను ఎవరైనా ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాలేజీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

- ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం ఏర్పాటు చేయాలి
- కాలేజీ విద్యార్థులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు




**టేకుల ప ల్లి, జూలై1 4 , ప్రజాజ్యోతి:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ కార్యదర్శి బయ్య అభిమన్యు ఆధ్వర్యంలో సోమవారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెమినార్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ వారు చేశారు.కళాశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన ప్రయోగశాలలు లేకపోవడంతో వారు ప్రయోగాలు చేయడంలో వెనుకంజలో ఉన్నారని వారు ఆరోపించారు.విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంలో అధికారుల నిర్లక్ష్య చేస్తున్నారని వారు ఆరోపించారు.కనీసం విద్యార్థులకు తాగడానికి మంచినీళ్లు లేనటువంటి పరిస్థితి ఉందని విద్యార్థులు బయట నుంచి వాటర్ కొనుక్కొని వస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాలలలో క్లాస్ రూమ్ లో ఫాన్స్, మరుగుదొడ్లు,ప్రహరీగోడలు ఇలాంటి సౌకర్యాలు లేకపోవడం వల్ల విద్యార్థుల నానా అవస్థలు పడుతున్నారు అని వారు ఆరోపించారు. వర్షాకాల నేపథ్యంలో కళాశాలల భవనములు శిథిలావస్థకు చేరడం వలన గోడలు తడిచి విద్యార్థులకు కరెంట్ షాక్ కు గురయ్యే అవకాశాలు చాలా ఉన్నాయని వారు ఆరోపించారు. విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా వాటి స్థానంలో అదనపు గదులు,అదనపు భవనాలు నిర్మించాలని వారు ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. ఇన్ని సమస్యల వలయంగా మారిన జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరడానికి ఎక్కువగా మొగ్గుచూపడం లేదని వారు ఆరోపించారు. వెంటనే సమస్యలను పరిష్కరించని లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలను నిర్వహిస్తామని వారు తెలిపారు. తక్షణమే స్థానిక శాసనసభ్యులు కోరం కనకయ్య చొరవ తీసుకొని జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.లేని పక్షాన విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కిషోర్, కళాశాల విద్యార్థులు సుమంత్ ,ప్రవీణ్ ,సురేష్ ,లక్ష్మణ్, మహేశ్వరి ,సుశీల తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలి

- :-టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గగులోత్ హరిలాల్ నాయక్



**ఆళ్ళపల్లి.జులై14.ప్రజాజ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం బదిలీలతో కూడిన పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆళ్ళపల్లి మండలంలో టిపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపెయిన్లో వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల,పాఠశాలలో విద్యార్థుల సమస్యలను సేకరించడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న పండిట్,పీఈటీ పోస్టులను వెంటనే అప్గ్రేడ్ చేసి పదోన్నతులు ఇవ్వాలని, కేజీబీవీలలో పని చేస్తున్న సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఇచ్చి రెగ్యులర్ చేయాలని,వారి పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని,గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సిఆర్టి లను వెంటనే రెగ్యులర్ చేయాలని, వారికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన నాలుగు పెండింగ్ డిఏలను వెంటనే చెల్లించాలని,పిఆర్సి ఫిట్మెంట్ను ప్రకటించి అమలు చేయాలని,ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న బిల్లులు అన్నింటిని క్లియర్ చేయాలని,గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ పోస్టులను మంజూరు చేయాలని,ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్ పోస్టులను మంజూరు చేయాలని, సిపీఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను అమలు చేయాలని, ఐటిడిఏ భద్రాచలం పరిధిలోని ఉపాధ్యాయుల పెండింగ్ లో ఉన్న రెగ్యులరైజేషన్,ప్రొబేషన్ డిక్లరేషన్లకు సంబంధించిన ఆర్డర్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు, కార్యకర్తలు,ఉపాధ్యాయులు వీరన్న,సోమ్లా,భావ్ సింగ్,నెహ్రూ,రవి,సాంబ శివరావు,రామయ్య,శ్రీను,కుమార్ రాజా,,రమేష్,చిన్న పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల జీతాలు చెల్లించాలని వినతి




**ఇల్లందు, జులై 15, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలను చెల్లించాలని కోరుతూ సోమవారం ఐఎన్టియుసి, టియుసిఐ ఆధ్వర్యంలో డిజియం సివిల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్టియుసి ఏరియా ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, ఐఎన్టియుసి జనరల్ సెక్రటరీ, కాంట్రాక్టర్స్ కార్మికుల ఇంచార్జ్ గోచికొండ సత్యనారాయణ, టియుసిఐ జిల్లా కార్యదర్శి యాకుబ్ షావలి లు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు 7వ తేదీన జీతాలు చెల్లించాలని సర్కులర్ ఉన్న 14వ తేదీ వచ్చిన కానీ జీతాలు చెల్లించ లేదన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులంటే లెక్కలేదన్నారు. జీతాలు పడకపోవడంతో కార్మికులకు అప్పుల వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారని, జీతాలు లేక, చెల్లించలేకపోతున్నారని, డ్వాక్రా, పొదుపు, ఇతర ఖర్చులు వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లను అడిగితే ఎకౌంట్ సెక్షన్లో బిల్లులు కావడం లేదని మేమేం చేయలేమని అంటున్నారని పేర్కొన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని, లేని యెడల కార్మికులతో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- * ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ



టేకులపల్లి,జూలై14, ప్రజాజ్యోతి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా మండలంలోని పలు గ్రామాల్లో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ సోమవారం విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు.బోడు, మొక్కంపాడు గ్రామ పంచాయతీలలోని గ్రామాలలో మాజి ఎమ్మెల్యే పర్యటించి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీసి కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరిని ఎండగడదాం,అంటూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సారథ్యంలో అమలైన పథకాలను ప్రస్తుత పాలన చేతకాని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిన మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని అని వారు ఆరోపిస్తున్నారు. తమ ఓటు అనే ఆయుధంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఈ చేతకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని వారు ఆమె ఆరోపిస్తున్నారు. కర్రు కాల్చి వాత పెట్టాలని,మరల బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆమె తెలిపింది. పాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రజలను ఇల్లందు మాజీ శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియనాయక్ ప్రజలను చైతన్యపరిచాలనీ పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశించారు .ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు బానోత్ రామానాయక్,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొమ్మర వరప్రసాద్,మండల యువ నాయకులు నాగేందర్, గ్రామపంచాయతీ స్థానిక నాయకులు నర సింహారావు, ప్రశాంత్,ఎట్టి ప్రసాద్,రవి తదితరులు పాల్గొన్నారు.

## క్రాంతి విద్యార్థి ప్రతిభ



**భద్రాచలం టౌన్, జులై 14(ప్రజాజ్యోతి):** భద్రాచలం పట్టణంలోని క్రాంతి విద్యాలయం విద్యార్థి నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశాలకు అర్హత సాధించి తన ప్రతిభను చాటాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన నవోదయ పాఠశాలలో, బాపట్ల జిల్లా చిలుమూరు గ్రామంలో శ్రీరామ రూరల్ సైనిక్ స్కూల్ లో తమ విద్యార్థి కొండపల్లి హేమంత్ శివ సాయి కృష్ణ అర్హత పరీక్షకి ఎంపికై సీటు సాధించాడని తెలిపారు. హాల్ టిక్కెట్ సంఖ్య 3595451 తో నవోదయలో సీటు సాధించడం ఆనందంగా ఉందని కరెస్పాండెట్ సమత అన్నారు.ఇట్టి విద్యార్థి ఎటువంటి కోచింగ్ లేకుండా ఉత్తీర్ణత పొందటం ,వారి తల్లితండ్రులు కొండపల్లి నవీన్ కుమార్, రాధిక ఆ విషయాన్ని తెలపడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్య సంవత్సరం నుంచి విద్యార్థులకు పోటీ పరీక్షలు,సివిల్స్ ,నీట్ , ఐఐటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి హేమంత్, బాలుని తల్లిదండ్రులును ఆమె అభినందించారు.

## నానో యూరియా తో సత్ఫలితాలు

- * నానో యూరియా పై రైతులకు అవగాహన
- * డిసిసిబి చైర్మన్ లక్కినేని సురేందర్ రావు

**టేకులపల్లి,జూలై14, ప్రజాజ్యోతి:** వ్యవసాయ రంగంలో నానో యూరియాతో సత్ఫలితాలు పొందవచ్చని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్రావు అన్నారు. సొసైటీ చైర్మన్ ఆధ్వర్యంలో సోమవారం నానో యూరియా ప్లస్,నానో డి ఏ పి పై జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నానో యూరియా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నదని ఆన్నారు. రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నానో సాంకేతికత పరిజ్ఞానంతో మొట్టమొదటిసారిగా యూరియాను ద్రవ రూపంలో తీసుకువచ్చిన ఘనత ఓ భారతీయుడిని ఇది దేశానికే గర్వకారణం అన్నారు.సత్వర ప్రయోజనం అందించే నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నానో యూరియా వాడకం పై రైతులకు అవగాహన కల్పించుటకు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించాలన్నారు.రైతు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి నానో యురియాను ఎలా ఉపయోగించాలో రైతులకు ప్రత్యక్షంగా చూపించాలన్నారు.నానో యూరియా వాడకం వల్ల అధిక దిగుబడి,ఖర్చు తగ్గడం,భూసార పరిరక్షణ, పర్యావరణహితం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



## సంస్మరణ కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థిసేన రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నగేష్



**పాల్వంచ(రూరల్), జూలై 14,ప్రజా జ్యోతి**:టేకులపల్లి కొత్తతండా గ్రామ విద్యార్థి నాయకడు భూక్యా సాయి ప్రశాంత్ రాథోడ్ చెల్లలు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం లో ఉస్మానియా యూనివర్సిటీ సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ అంగోత్ నగేష్ పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో గిరిజన నాయకులు,విద్యార్థి నాయకుడు భూక్యా వంశీ కృష్ణ,సాయి ప్రశాంత్ రాథోడ్ మాలోత్ రమేష్,గిరిజన నాయకులు పాల్గొన్నారు పలు సమస్యలపై మాట్లాడం జరిగింది.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ



**భద్రాచలం కల్చరల్ , జూలై 14,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోమూలవరులకు హైదరాబాద్కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడామండపంలో నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

## పిఆర్టియు టిఎస్ సభ్యత్వం నమోదు కార్యక్రమం.



**టేకుల పల్లి, జూలై14 , ప్రజాజ్యోతి:** మండలంలోని జెడ్పి హెచ్ఎస్ సులానగర్ పాఠ శాల లో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు పూనెం.నర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల అవగాహన కలిగిన అతిపెద్ద సంఘం అలాగే ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ఉపాధ్యాయులకు చెల్లించాలని డిమాండ్ చేయడం జరిగింది అని వారు తెలిపారు. ఉపాధ్యాయులకు మేలు కలిగే నిర్ణయాలను సాధించే విధంగా మన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కృషి చేస్తున్నారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రవీందర్,భాస్కర్ రాష్ట్ర నాయకురాలు విజయనిర్మల, టేకులపల్లి మండల ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు,టేకులపల్లి మండల నాయకులు రమణ, ఇల్లందు మండల అధ్యక్షులు రమేష్,ఇల్లందు మండల అసోసియేట్ అధ్యక్షులు శ్రీను, సుజాతనగర్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవదాసు, పాఠశాల సిబ్బంది స్వరూప,శ్రీ లక్ష్మీ, మురళీధర్,వెంకట్ రెడ్డి, లక్ష్మణ్, బాలు, శ్రీను,సిఆర్పి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ సవరణ క్యాంప్ కు విశేష స్పందన

- --భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు

**భద్రాచలం, జూలై 14,ప్రజాజ్యోతి :** ఆధార్ సవరణ క్యాంప్ కు భద్రాచలంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని భద్రాచలం ఆర్డీవో దామోదర్రావు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆధార్ సవరణ క్యాంపును తొలిరోజు ఆర్డీవో దామోదర్రావు ప్రారంభించి పరిశీలించారు. ఆధార్ వివరాల నవీకరణ, చిన్నపిల్లల బయోమెట్రిక్ నమోదు, చిరునామా మార్పులు, మొబైల్ నెంబర్ అనుసంధానం వంటి సేవలు ఒకేచోట అందుబాటులో ఉంచడంతో ప్రజలు ఆధార్ క్యాంప్కు వచ్చి ఆధార్లో తప్పులను సవరించుకున్నారన్నారు. 600 మందికి పైగా ప్రజలు హాజరయ్యారని, 300 మందికి పైగా ఆధార్ కార్డుల సవరణ రిజిస్ట్రేషన్లు నమోదు చేయించుకున్నారన్నారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపహాడ్ మండలాల నుంచి ప్రజలు తరలిరావడంతో వారికి అనుగుణంగా ఏడు ఆధార్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి మంచినీటి సౌకర్యంతో పాటు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వచ్చిన ప్రజలకు ఆధార్ లో సవరణలను పరిశీలించామన్నారు. ఈ



కార్యక్రమంలో డీటీ డానియేల్ వెంకటేశ్వరరావు, చర్ల డీటీ రాజు, నాలుగు మండలాల ఆర్ఐలు, సబ్కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్ లో గిరిజనుల సమస్యలు పరిష్కారం

- -గిరిజన దర్బార్ లో ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం, జూలై 14,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఐటీడీఏలో నిర్వహించే గిరిజన దర్బార్ లో గిరిజనుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయని, అందుకు యూనిట్ అధికారులు ప్రత్యేక కృషిచేస్తారని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో పీవో రాహుల్ గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. తన పరిధిలో ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించి మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ సాధ్యమైనంత త్వరగా అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా ప్రత్యేక చొరవ చూపాలని యూనిట్ అధికారులను ఆదేశించారు. గిరిజనులు పెట్టుకున్న అర్జీల్లో పోడు భూములు, వ్యక్తిగత, భూ సమస్యలు, గిరిజన గురుకులాల్లో ఇంటర్మీడియట్, ఐదవతరగతిలో సీట్లు ఇప్పించడం, గిరిజన వికాసం ద్వారాబోర్లు వేసుకోవడానికి అనుమతి, ట్రైకార్ ద్వారా బోరు, కరెంటు, మోటారు వేసుకోవడానికి అనుమతులు, వితంతు పెన్షన్లు, పోడు పట్టాల పేర్లు మార్పు, కిరాణాషాపులు, ఫ్యాన్సీ స్టోర్లు పెట్టుకునేందుకు రుణాలు, దీర్ఘకాలిక వ్యాధులు, ఉన్నత చదువుకు ఆర్థికసాయం తదితర వాటికి సంబంధించి అర్జీలు గిరిజనులు సమర్పించారు. గిరిజనులు సమర్పించిన అర్జీలు అన్ని ఆన్లైన్ ద్వారా నమోదు చేసి అర్హులైన ప్రతి గిరిజనులకు విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో డేవిడ్రాజ్, ఏవో సున్నం రాంబాబు, ఎస్వో భాస్కరరావు, ఉద్యాన అధికారి ఉదయ్కుమార్, కొండరెడ్ల అధికారి రాజారావు, ఆర్వోఎస్ఆర్ డీటీ లక్ష్మినారాయణ, ఏపీవో పవర్ వేణు, ఐసీడీఎస్ సూపర్వైజర్ అనసూయ, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ, ప్రమీలబాయ్, నర్సింహారావు, మోహన్, భార్గవి, వెంకటేశ్వర్లు, ముత్తయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రేగా మాతృమూర్తికి బీఆర్ఎస్ నేతల నివాళులు



**భద్రాచలం, జూలై 14,ప్రజాజ్యోతి :** బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాతృమూర్తి రేగా నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం భద్రాచలం బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, యూత్ కార్యదర్శి బద్ది బాబి, రైతుసంఘం నాయకులు అయినాల రామకృష్ణ, కిషోర్ లు రేగా నివాసానికి వెళ్లి నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రేగా, కుటుంబసభ్యులను పరామర్శించారు.

## నేడు ఓటరు పోలింగ్ బూత్ లెవల్ అధికారులకు ఒకరోజు శిక్షణ : ఆర్డీవో



**భద్రాచలం, జూలై 14,ప్రజాజ్యోతి :** భారత ఎన్నికల సంఘం కమీషనర్ ఆదేశాల మేరకు భద్రాచలం మండల పరిధిలోని ఓటరు పోలింగ్ స్టేషన్ బూత్ లెవల్ అధికారులకు మంగళవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఆర్డీవో దామోదరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న భద్రాచలం డిగ్రీ కళాశాలలో ఉదయం ఈ శిక్షణా కార్యక్రమం ఉంటుందని, బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు ఉస్మాన్ ఖాన్ కు జీవన సాఫల్య పురస్కారం

- జూలై 20న హిందూపురంలో అవార్డు ప్రదానం



**ములకలపల్లి, జూలై 14, ప్రజా జ్యోతి:** ప్రముఖ కాలమిస్టు, కవి, రచయిత, అనువాదకులు యండి. ఉస్మాన్ ఖాన్కు ప్రతిష్టాత్మక గిడుగు వెంకట రామమూర్తి జీవన సాఫల్య జాతీయ సాహితీ సేవా పురస్కారం – 2025 ప్రకటించారు. ఈ నెల 20వ తేదీన హిందూపురంలోని సెవెన్ స్టార్ ఫంక్షన్ హాల్ లో భారత సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలగౌడ చేతులమీదుగా ఉస్మాన్ ఖాన్ కు ఈ అవార్డును అందజేయనున్నారు. తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న గిడుగు వెంకట రామమూర్తి స్మరణలో ప్రతీ సంవత్సరం ఈ అవార్డు అందజేస్తుంటారు. యండి. ఉస్మాన్ ఖాన్ తమ రచనల ద్వారా తెలుగు, ఉర్దూ, భాషల్లో అనేక సామాజిక సమస్యలపై రచనలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉస్మాన్ ఖాన్ గత మూడున్నర దశాబ్దాలుగా తెలుగు, ఉర్దూ, భాషల్లో సాహిత్యరంగానికి సేవలందిస్తున్నారు. సమకాలీన సామాజిక అంశాలపై విశ్లేషణాత్మక కాలమ్స్, కవిత్వం, పత్రికా రచనలు చేశారు. ఆయన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, సత్యసాయి రచయితల సంఘం, అఖిల భారత షహీద్ టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. భారత సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాల గౌడ, ప్రముఖ గజల్ దిగ్గజం గజల్ శ్రీనివాస్ , ఆచార్య రవిశంకర్ గురూజీ, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మెళవాయి గోవిందరెడ్డి, విశ్వవిజ్ఞాన విద్యాపీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా తదితరులు పాల్గొంటారు. జస్టిస్ గోపాల గౌడ చేతులమీదుగా ఉస్మాన్ ఖాన్కు అవార్డు ప్రదానం జరగనుందని నిర్వాహకులు తెలిపారని ఆయన వెల్లడించారు.